క్లుప్తంగా

అభివృద్ధి పనులపై దిశానిర్దేశం



మాట్లాడుతున్న మేయర్ శిరీష

తిరుపతి తుడా : నగరంలోని చేపట్టిన అభివృద్ధి పనులపై కార్పొరేషన్ అధికారులకు మేయర్ శిరీష దిశానిర్దేశం చేశారు. త్వరలో నిర్వహించనున్న కౌన్సిల్ మీటింగ్‌లో చర్చించాల్సిన మినిట్స్‌పై శనివారం సాయంత్రం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మేయర్ మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగకరమైన అభివృద్ధి పనులతో కూడిన జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించారు. నగరవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రామాణికంగా తీసుకుని వాటి పరిష్కారమే లక్ష్యంగా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. అన్ని వార్డులకు సమ ప్రాధాన్యమిస్తూ పనులను జాబితాలో పొందుపరచాలని సూచించారు. కమిషనర్ మౌర్య మాట్లాడుతూ కార్పొరేట్లు ఇచ్చిన వినతులు, నగర పర్యటనలో ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలు, గ్రీవెన్స్ అందించిన అర్జీలను పరిగణనలోకి తీసుకుని జాబితా సిద్ధం చేసినట్లు వెల్లడించారు. సమావేశంలో కార్పొరేటర్లతోపాటు ఎస్ఈ శ్యామ్‌సుందర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి విరాళం



నగదు అందిస్తున్న దాత

తిరుపతి రూరల్ : మండలంలోని భవిత కేంద్రంలో (బధిరుల పాఠశాల) మరుగుదొడ్ల నిర్మాణానికి దాత అరుణ రూ.25వేల విరాళం అందించారు. శనివారం ఈ మేరకు ఎంఈఓ శంకరయ్యకు నగదు అందజేశారు. ఈ సందర్భంగా దాతను ఎంఈఓ అభినందించారు.

23న గంగమ్మ ఆలయంలో వేలం

తిరుపతి కల్చరల్ : తాతయ్యగుంట గంగమ్మ గుడిలో ఏడాది పాటు వివిధ పనులకు సంబంధించి ఈనెల 23వ తేదీ ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ నైనార్ మహేష్ యాదవ్, ఈఓ జయకుమార్ తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ భక్తులు సమర్పించే వస్త్రాలు, కొబ్బరి చిప్పలు, సజీవ కోళ్ల సేకరణ హక్కులే, పాదరక్షల రుసుం వసూలు, వెయ్యికళ్ల దుత్తలు విక్రయానికి వేలం ఉంటుందని వివరించారు.

ఉద్యమ సంతకం

"కూటమి ప్రభుత్వం కార్పొరేట్లకు కొమ్ముకాస్తోంది. మహోన్నత ఆశయంతో గత వైఎస్సార్‌సీపీ హయాంలో చేపట్టిన మెడికల్ కాలేజీలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు కుట్ర పన్నుతోంది. పేదలకు వైద్యంతోపాటు విద్యను దూరం చేసేందుకు తెగబడుతోంది. చంద్రబాబు దుర్మార్గపు ఆలోచనలను అడ్డుకునేందుకే కోటి సంతకాల సేకరణ చేపట్టాం. క్షేత్రస్థాయిలో సర్కారు కుయుక్తులను ఎండగడతాం. ప్రజల భాగస్వామ్యంతో ఉధృతంగా ఉద్యమిస్తాం" అని వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి స్పష్టం చేశారు.

- పేదలకు వైద్యం, విద్య అందకుండా చంద్రబాబు కుట్రలు
- కార్పొరేట్లకు దోచిపెట్టేందుకే మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ
- భూమన అభినయ్‌రెడ్డి



సంతకాల సేకరణలో వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త అభినయ్ రెడ్డి తదితరులు

తిరుపతి మంగళం : పేదలకు ఉచిత వైద్యం, విద్యను దూరం చేసేందుకు చంద్రబాబు అనేక కుట్రలు పన్నుతున్నారని వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా శనివారం 1వ డివిజన్ తిమ్మినాయుడుపాళెంలో కార్పొరేటర్ ఆదం రాధాకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ చేపట్టారు. అభినయ్ మాట్లాడుతూ పేదలు ఉన్నతంగా ఎదిగితే చంద్రబాబు తట్టుకోలేరంటూ ఆరోపించారు. 2019వరకు రాష్ట్రంలో 12 మెడికల్ కాలేజీలు మాత్రమే ఉండేవని, జగనన్న పాలనలో 17 వైద్య కళాశాలలను నెలకొల్పారని వెల్లడించారు. వాటిలో ఐదు కాలేజీల నిర్మాణం పూర్తి కావడంతో అడ్మిషన్లు సైతం జరుగుతున్నాయన్నారు. మిగిలినవి కూడా 70శాతం పూర్తయ్యాయని, వాటిని అందుబాటులోకి తీసుకొస్తే పేదలకు మెరుగైన వైద్యంతో ఉచితంగా వైద్య విద్యకూడా అందించవచ్చని వివరించారు. కానీ, కార్పొరేట్లకు దోచిపెట్టి రూ. వేల కోట్లు దండుకోవాలనే దురాలోచనతో చంద్రబాబు కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. అందుకే కోటి సంతకాలతో ప్రజా ఉద్యమం చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, కార్పొరేటర్ బోకం అనిల్‌కుమార్, నేతలు నవీన్ బృంగి, వాసు యాదవ్, రామకృష్ణారెడ్డి, పాడి శివ ప్రసాద్ యాదవ్, సుశీల యాదవ్, వెలకచర్ల గోపాల్‌రెడ్డి, కుప్పయ్య, గుణ, రమణారెడ్డి, బుజ్జిరెడ్డి, జయచంద్రారెడ్డి, రాజేంద్ర, రమేష్‌రెడ్డి, చెంగల్రాయులు, వినోద్‌యాదవ్, సుజిత్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధన్వంతరి జయంతి



ధన్వంతరికి పూజలు నిర్వహిస్తున్న అధ్యాపకులు



శోభాయాత్రలో మాధవ్ తదితరులు

తిరుపతి సిటీ : జాతీయ సంస్కృత వర్సిటీ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా ధన్వంతరి జయంతి నిర్వహించారు. వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, అకడమిక్ డీన్ రజనీకాంత్ శుక్లా, స్విమ్స్ కార్డియాలజీ విభాగం ప్రొఫెసర్ వి.వనజాక్షమ్మ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ధన్వంతరి దివ్య వైద్యుడిగా, ఆయుర్వేద పితామహుడిగా ప్రసిద్ధి చెందారని కొనియాడారు.

వేడుకగా శోభాయాత్ర..

తిరుపతి గాంధీ రోడ్ : ధన్వంతరి జయంతిని పురస్కరించుకుని బీజేపీ ఆధ్వర్యంలో వేడుకగా శోభాయాత్ర చేపట్టారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు వీవీఎన్ మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు 'చెకుముకి' పరీక్షలు



పరీక్షను పర్యవేక్షిస్తున్న వెంకటసిద్ధులు

పాకాల : మండలంలోని మొగరాల జెడ్పీ హైస్కూల్‌లో 8,9,10వ తరగతుల విద్యార్థులకు శనివారం చెకుముకి టాలెంట్ పరీక్షలు నిర్వహించారు. జన విజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడు వనపర్తి వెంకట సిద్ధులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 720 మంది విద్యార్థులు పరీక్ష రాశారన్నారు. వీరిలో ఒక్కో తరగతి నుంచి ముగ్గురిని ఎంపిక చేస్తామని చెప్పారు. నవంబర్ 1వ తేదీన నిర్వహించే మండలస్థాయి పరీక్షలకు వీరు హాజరవుతారని వెల్లడించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల పిల్లలకు వేర్వేరుగా పరీక్ష చేపట్టనున్నట్లు వివరించారు.

వైభవంగా పవిత్ర సమర్పణ

చంద్రగిరి : శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం వైభవంగా పవిత్ర సమర్పణ చేపట్టారు. ఈ సందర్భంగా ఉదయం స్వామివారిని సుప్రభాతంతో మేల్కొలిపి, తోమాల సేవ, కొలువు, పంచాంగశ్రవణం, సహస్రనామార్చన నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవర్లకు వేడుకగా స్నపన తిరుమంజనం జరిపించారు. అనంతరం మూలవర్లకు, ఉత్సవర్లకు శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ చేశారు. సాయంత్రం దేవదేవేరులను తిరుచ్చిపై కొలువుదీర్చి ఊరేగించారు. ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపీనాథ్ పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో దేవదేవేరులు

'వీక్ష'లో దీపావళి వేడుకలు

తిరుపతి సిటీ : ఆర్‌కే గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ వారు వీక్ష ది స్కూల్‌లో శనివారం ముందస్తు దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల చైర్మన్ డాక్టర్ ఆర్‌కే రెడ్డి, డైరెక్టర్ ఆర్‌కే విమల మాట్లాడుతూ దీపావళి ప్రాముఖ్యతను వివరించారు.



దీపావళి వేడుకలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

'స్వచ్ఛత'.. మన బాధ్యత

తిరుపతి, చంద్రగిరి నియోజకవవర్గాల్లో శనివారం స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. రుయాలో సూపరింటెండెంట్ రాధ ఆధ్వర్యంలో పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఎస్వీ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ ప్రకాష్‌బాబు నేతృత్వంలో సైకిల్ ర్యాలీ చేపట్టారు. ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాలలో ప్రిన్సిపల్ సత్యనారాయణ ఆధ్వర్యంలో స్వచ్ఛ పనులు నిర్వహించారు. చైతన్యభారతిలో కరస్పాండెంట్ కె.జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతకు కృషి చేస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. పద్మావతి మహిళా వర్సిటీలో మొక్కలు నాటారు.

- తిరుపతి తుడా/తిరుపతి సిటీ/తిరుపతి రూరల్



పద్మావతి మహిళా వర్సిటీలో..



రుయాలో..



ఎస్వీ జూనియర్ కళాశాలలో..